క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గాయత్రి మహాయజ్ఞం


పూజల్లో పాల్గొన్న భక్తులు

కురుపాం: స్థానిక గాయత్రి శక్తిపీఠంలో ఐదు కుండీల గాయత్రి మహాయజ్ఞం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం పంచిపెట్టారు.

నేత్ర శస్త్రచికిత్సకు 64 మంది ఎంపిక

బాడంగి: స్థానిక శివాలయం దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత నేత్రవైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. బాడంగి, పిన్నవలస, పూడివలస, భీమవరం, డొంకినవలస తదితర ప్రాంతాల నుంచి 109 మంది కంటి రోగులు హాజరై, తమ కళ్ల ఆరోగ్యాన్ని పరీక్షించుకున్నారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 64 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ వెంకటరమణ తెలిపారు. వీరందరినీ బస్సులో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించామన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

తెర్లాం: మండలంలోని పణుకువలస, సోమిదలవలస గ్రామాల్లో సర్పంచ్ చందక సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వర్షాకాలం కావడంతో నీరు నిల్వ ఉండిపోకుండా కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికలు తొలగించారు. గ్రామస్తులు కూడా పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని, అనవసరంగా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని కోరారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటిస్తేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని గుర్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధి గ్రా మాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ డీఈ పి.హరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుజ్జింగివలస, గోషాడ, తెట్టంగి, పోలాయవలస, చుక్కపేట, చోడ వరం ,పెనుబర్తి, చింతపల్లిపేట, గంగిరెడ్లపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శివాలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు మేడపాటి కిశోర్‌శర్మ ప్రత్యేక పూజలు, హోమం, మండపారాధన చేశారు. సోమవారం అభిషేకాలు, అష్టోత్తరశతనామ పూజలు, శివపార్వతుల కల్యాణం జరిపించను న్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించను న్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎర్రపాటి రమణమూర్తి ఇటీవల మరణించారు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. రమణమూర్తి మృతిపై సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాకాడ రాంబాబు, ఎర్రపాటి సూర్యనారాయణ, రంభ వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకాలు


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం అమ్మవారిని భక్తుల దర్శనార్థం అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో దాతల సహకారంతో అమ్మవారి దేవస్థానంలో భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.



● మనోహరం.. జలవిహారం!

సీతంపేట అడ్వెంచర్ పార్కు అందాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులతో పార్కు కళకళలాడింది. సందర్శకుల్లో ఎక్కువ మంది ఇక్కడి జలవిహార్‌లో బోటుషికారు చేసి, ఆనందించారు. మరికొంత మంది బంజీట్రంపోలిన్, క్లైంబింగ్‌వాల్, జెయింట్‌వీల్ వంటి సాహస క్రీడలు ఆడి, సరదాగా గడిపారు. -సీతంపేట

● అందం.. ఆహ్లాదం!

పాలకొండ-సీతంపేట రోడ్డులో మన్యం అందాలు చూపరుల మదిని దోచేస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతం కావడం, ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కొండలు పచ్చదనంతో నిండుకున్నాయి. ఈ దారిలో వెళ్లేవారు ఆహ్లాదకర వాతావరణంలో రోడ్డుకు ఇరువైపులా నెలకొన్న ప్రకృతి సోయగాన్ని ఆస్వాదిస్తూ ప్రయాణిస్తున్నారు. అక్కడక్కడ ఎత్తైన ప్రాంతాల నుంచి జాలువారే జలపాతాలు సైతం అందరి దృష్టినీ ఆకర్షిస్తుండడం విశేషం.

-పాలకొండ రూరల్





● పైనాపిల్.. పోషకాలు ఫుల్!

సీతంపేట ఏజెన్సీ కొండల్లో పండించే పైనాపిల్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. సహజసిద్ధ వాతావరణంలో పెరిగే ఈ పైనాపిల్ ఎంతో రుచికరంగా ఉండడంతో పాటు అనేక పోషక విలువలను కలిగి ఉంటాయి. వీటిని తినేందుకు అందరూ ఇష్టపడడంతో మార్కెట్‌లో ఈ పంటకు మంచి డిమాండ్ ఉంది. దీంతో మైదాన ప్రాంతాల నుంచి కొంతమంది వ్యాపారులు కొండల మీదకు వెళ్లి మరీ పైనాపిల్‌ను కొనుగోలు చేసి, పాలకొండ మార్కెట్‌లో విక్రయిస్తుండడం గమనార్హం. -పాలకొండ రూరల్

గిరిజన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగునాయుడు

జియ్యమ్మవలస: గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి గంగునాయుడు కోరారు. మండల పరిధిలోని చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులను ఆయన ఆదివారం కలిసి, పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల్లో చాలామంది మలేరియా జ్వరం బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారని, చినమేరంగి ఆస్పత్రిలో 30 పడకలు ఉంటే 40 మంది వరకు రోగులు ఉన్నారని తెలిపారు. వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తమై గిరిజన ప్రాంతాల్లో ఫీవర్ సర్వే ముమ్మరం చేసి, జ్వరపీడితులకు అవసరమైన మందులు అందజేయాలన్నారు. వీలైనంత వరకు గ్రామాల్లోనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, నిత్యం అందుబాటులో ఉండాలన్నారు.

చినమేరంగిలో ఉన్న రోగులంతా అర్నాడ, వనజ, కొత్తవలస, కొత్తగూడ, చినదోడిజ గిరిజన గ్రామాలకు చెందిన వారేనని, ఆయా గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీటి నిల్వలు, కాలువల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయడంతో పాటు దోమతెరలు పంచిపెట్టాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు భూతల మోహనరావు తదితరులు ఉన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

పాలకొండ: ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమైన నేపథ్యంలో సాగునీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంఘం నాయకుడు బి.అప్పలనాయుడు ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. జూన్ నెల పూర్తికావస్తోందని, నాగావళి ఎడమకాలువ ద్వారా సాగునీరు విడుదల చేయాలని, చెరువుల్లో నీరు నింపాలన్నారు. ఇప్పటికే రైతులు పొలాల్లో వెదలు వేశారని, చెరువుల్లో నీరు ఉంటే రైతాంగానికి సాగునీటి ఇబ్బంది ఉండదన్నారు. ప్రస్తుతం నీరు విడుదల చేస్తే శివారు ప్రాంతాలకు ఆ నీరు చేరేసరికి దాదాపు 15 రోజుల వరకు పట్టవచ్చన్నారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ అధికారులు చొరవ తీసుకుని, అన్నదాతకు మేలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష్మీపురంలో డివిజన్ స్థాయి తాళం భజన పోటీలు

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో సాయిరాం భజన మండలి సమాజం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు డివిజన్ స్థాయిలో నిర్వహించనున్న తాళం భజన పోటీల్లో భజన మండలి కళాకారులు పాల్గొనాలని నిర్వాహకుడు సీహెచ్ వెంకటరమణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ జూన్ 17,18,19 తేదీల్లో పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు బొబ్బిలి, సీతానగరం, బలిజిపేట, సాలూరు, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం మండలాలకు చెందిన భజన బృందాలై ఉండాలని, మధ్యాహ్నం 1గంటకు హాజరుకావాలని కోరారు. పోటీల్లో పాల్గొనదలచిన భజనమండలి గ్రూప్ చిరునామా, ప్రవేశరుసుం రూ. 300లు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఎంపికైన బృందాలకు బహుమతుల ప్రదానం, సత్కారం ఉంటుందని తెలిపారు. భోజన వసతి కల్పించనున్నామని, ఇతర వివరాల కోసం ఫోన్ నంబర్ల 9502833436 లేదా 9490460976ను సంప్రదించాలని సూచించారు.

ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీ దేవాంగుల వీధి, కర్రోతువీధికి తాగునీరు సరఫరా అవుతున్న ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుల బారిన పడడంతో తాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఫిర్యాదులు చేసిన మేరకు మరమ్మతులు చేసినట్లు ఏఈ పవన్‌కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ జె.తేరేజమ్మ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి వెంకటరావు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారన్నారు. సోమవారం యథావిధిగా తాగునీరు ఇంటింటి కుళాయిల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జె.వెంకటరావు, గ్రామ పెద్ద గరికయ్య పాల్గొన్నారు.


పైప్‌లైన్‌కు చేస్తున్న మరమ్మతులు

జ్వర పీడితులకు గ్రామంలోనే వైద్యసేవలు

సీతానగరం: వర్షాలు కురవడం వల్ల ప్రజలు జ్వరాల బారిన పడే ఆస్కారం ఉన్నందున వైద్యసిబ్బంది స్థానికంగానే మెరుగైన వైద్య సేవలందించాలని పీహెచ్‌సీ డాక్టర్ బి.పావని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె పీహెచ్‌సీలో మాట్లాడుతూ మూడు రోజుల నుంచి అరకొరగా వర్షాలు కురవడం వల్ల పొలం పనులకు వెళ్తున్న వారు తడిసిపోయి జ్వరాల బారిన పడుతున్నారన్నారు. వాతావరణం చల్లగా ఉన్న సమయంలో జీర్ణం కాని ఆహార పదార్థాలు తిని అజీర్ణానికి గురై విరేచనాలకు గురవుతారన్నారు. వైద్యశాఖ సూపర్‌వైజర్ల పర్యవేక్షణ లో గ్రామాల్లో వైద్య సిబ్బంది పరిశీలించి ఇంటింటి సర్వే నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించడానికి సూచనలు జారీ చేశామన్నారు. ఇప్పటికే వెల్‌నెస్ కేంద్రాల్లో వివిధ రకాల వ్యాధులను గుర్తించడానికి అవసరమైన పరికరాలున్నాయని, వ్యాధి తగ్గుముఖం పట్టడానికి అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల్లో వ్యాధుల బారిన పడుతున్న వారంతా వినియోగించుకోవాలని కోరారు. స్థానికంగా వ్యాధి నయంకాని వారిని పీహెచ్‌సీకి తరలించేవిధంగా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెప్పారు.

వరివెద సాగు

సీతానగరం: మండలంలో మూడు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా మట్టినమూనాలు చేసి ఉంచిన పొలాల్లో వరివెదల రూపంలో రైతులు వరి సాగు చేస్తున్నారని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన నీలకంఠాపురం, వెంకటాపురం, బూర్జ, నిడగల్లు గ్రామాల్లో వరివెదల రూపంలో చేస్తున్న సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటివనరులున్న గ్రామాల రైతులు ఇప్పటికే మట్టి నమూనాలు చేయడానికి దుక్కి చేసి కలుపు నివారణ మందును పిచికారీ చేస్తున్నారన్నారు. కలుపు లేని వరిపంట పండించాలన్న సంకల్పంతో వెదలు వేసినప్పటి నుంచే జాగ్రత్తలు పాటించాల్సి ఉందని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులే భవిష్యత్‌లో వారికి అవసరమైన విత్తనాలు స్వయానా తయారు చేసుకోవడంలో అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఖరీఫ్‌సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.


నీలకంఠాపురంలో వరి వెద దుక్కులు చేస్తున్న రైతులు

నేడు బక్రీద్

పాలకొండ రూరల్: స్థానిక జామియా మసీదులో బక్రీద్ పండగ సోమవారం నిర్వహిస్తున్నట్లు ముస్లిం మతపెద్ద షేక్ ఇస్మాయిల్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఉదయం 8 గంటలకు ప్రత్యేక నమాజ్ చేస్తామని, ముస్లిం సోదరులు పాల్గొనాలని కోరారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈ బక్రీద్‌ను ఈద్ ఉల్ జుహ అని కూడా పిలుస్తారని, ఇస్లాం క్యాలెండర్ ప్రకారం చివరి నెల అయిన జిల్ హజ్‌లో 10వ రోజున బక్రీద్ నిర్వహిస్తారని తెలిపారు.

ఆదివాసీ ఉద్యోగాలకు నూతన చట్టం చేయాలి

పార్వతీపురంటౌన్: జీవో నంబర్ 3 స్థానంలో ఆదివాసీ ఉద్యోగ నియామకాలకు నూతన చట్టాన్ని ఏర్పాటు చేయాలని తాళ్లబురిడి సర్పంచ్ రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం గిరిజన భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ షెడ్యూల్ ప్రాంతంలో రుద్దయిన జీవో నంబర్ 3 స్థానంలో ఆదివాసీ ఉద్యోగ నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం నూతన చట్టాన్ని ఏర్పాటు చేసి ఆదివాసీ ప్రాంతంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో స్పెషల్ డీఎస్సీని ప్రకటించాలని కోరారు. ప్రస్తుతం ప్రకటించిన 16,349 ఖాళీలతో పాటు 5వ షెడ్యూల్ నిబంధనలకు అనుకూలంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి బ్యాక్‌లాగ్ పోస్టులు కూడా ప్రకటించాలని కోరుతున్నామన్నా రు. సమావేశంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

నారుమడులు సిద్ధం చేసుకోండి

బాడంగి: ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించిన రైతులంతా నారుమడులు సిద్ధం చేసుకోవాలని ఏవో కె. శిరీష తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పరికరాలు, పచ్చిరొ ట్ట విత్తనాలు పంపిణీ చేయడాన్ని పరిశీలించిన ఆమె.. ఎకరా పంట పొలంలో 10 సెంట్ల స్థలంలో నారుమడి తయారు చేసుకోవాలన్నారు. నేలను శుభ్రంగా దుక్కి చేసి, చదును చేసుకోవాలన్నారు. ఆ తర్వాత ఆ నేలలో పశువుల గెత్తంతో గానీ గొర్రె లు, మేకల మంద గెత్తంతో గానీ వేసి, సారవంతం చేసుకోవాలన్నారు. అలా చేసిన నేలలో అదునుచూసి, నారు పెంచుకోవాలన్నారు. అయితే నార్లు వేసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. విత్తనాలను శుద్ధి చేసుకుని, నాటుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులకు ఆస్కారం ఉంటుందన్నారు.

శిశుమందిర్‌లో పోస్టుల భర్తీ

బొబ్బిలి: స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో బోధకుల నియామకానికి ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మాతాజీ, ఆచార్యుల పోస్టుల భర్తీ కోసం చేపట్టిన ఈ ఇంటర్వ్యూలకు 16 మండలాల నుంచి ఔత్సాహికులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఇంటర్వ్యూలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి అవకాశం కల్పిస్తున్నామన్నారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం

శృంగవరపుకోట: రాజీపేట వద్ద ఉన్న శంబలన గరిలో గాయత్రీ దేవి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం సత్యసాయి ట్రస్ట్ నేతృత్వంలో క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గాయత్రీ దేవి జయంతి సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్న ట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గరుగుబిల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని లైబ్రేరియన్ ఎస్.మధుసూదనరావు ఆకాంక్షించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వియ్ లవ్ రీడింగ్(చదవడమంటే మాకిష్టం) కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు ప్రముఖ సంఘ సంస్కర్త వావిలాల గోపాలకృష్ణయ్య జీవిత చరిత్రను వివరించారు. మంచి నడవడిక, ప్రవర్తన, క్రమశిక్షణ అలవడాలంటే ప్రముఖుల జీవిత చరిత్రలను చదివి స్ఫూర్తి పొందాలని లైబ్రేరియన్ సూచించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, క్యారంబోర్డు పోటీలు నిర్వహించారు. అలాగే పద్య పఠనం, పద్యాల కంఠస్థంపై అవగాహన కల్పించారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఇప్పుడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.


గ్రంథాలయం ఆవరణలో క్యారంబోర్డు గేమ్ ఆడుతున్న విద్యార్థులు

సన్నిధానం నిర్మాణ పనులు ప్రారంభం

పాలకొండ: పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయ పరిసరాల్లో శివస్వాముల సన్నిధానం నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్వాములు నిత్యం మాలలు వేసుకుని, పూజలు చేసుకునేలా నిర్మాణానికి భక్తులు చర్యలు తీసుకుంటున్నారు. గురుస్వాముల ఆధ్వర్యంలో రూ.5 లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేస్తున్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పట్టణవాసులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. సన్నిధానం నిర్మాణానికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని పలువురు తెలిపారు.


సన్నిధానం నిర్మాణ ప్రాంతంలో అన్నదానం

జీవో నంబర్ 3ను అమలు చేయాలి

కురుపాం: గిరిజన నిరుద్యోగులకు మేలు చేసే జీవో నంబర్ 3ను పక్కాగా అమలు చేయాలని ట్రైబల్ రైట్‌ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డీఎస్సీ నోటిఫికేషన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం చాలా సంతోషకరమని, అంతకంటే ముందు ఇచ్చిన జీవో నంబర్ 3 అమలు హామీని కూడా నెరవేర్చాలని కోరారు. మెగా డీఎస్సీ నిర్వహణకు ముందే గిరిజన నిరుద్యోగుల కోసం స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.


ట్రైబల్ రైట్‌ఫోరం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను..

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

భామిని: తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తానని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని లివిరి, భామిని, నేరడి-బి, గురండి గ్రామాల్లో ఎమ్మెల్యేను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా ఎన్నుకునేందుకు ఓటు వేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు నన్ను ఎంతో నమ్మి ఈ అవకాశం ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. కార్యక్రమంలో బత్తిలి ఏఎస్ఐ పి.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

తాగునీటి సదుపాయం కల్పించండి

సీతంపేట: తాగునీటి సదుపాయం కల్పించాలని మండలంలోని రామన్నగూడ, మద్యగూడ తదితర గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. గతకొన్ని రోజులుగా ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నా సక్రమంగా అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు.

● గ్రామదేవతలకు పూజలు



భామిని: మండలంలోని నేరడి-బి గ్రామంలో కొలువైన గ్రామదేవతలు సిరుల ఎల్లమ్మ, బంగారమ్మలకు గ్రామస్తులు ఆదివారం పూజలు చేశారు. తొలుత ఘటాలు ఊరేగించి, అమ్మవార్లకు ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాజాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బొద్దాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమావతి అన్నారు. ఆదివారం అదే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. రాజాం పర్యావరణ పరిరక్షణ సమి తి అందించిన మొక్కలను విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో ఆమె నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పరిరక్షించాలని కోరారు. రాజాం గ్రీనరీకి వెయ్యి మొక్కలు నాటడ మే లక్ష్యంగా రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కృషి చేస్తోందని, వారి సేవలు అభినందనీయమ న్నారు. కార్యక్రమంలో రాజాం పర్యావరణ పరిరక్ష ణ కమిటీ కన్వీనర్ నాయుడు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయురాలు హైమావతి తదితరులు